క్లుప్తంగా

డి.రంగాపురంలో తాగునీటి కష్టాలు

ప్యాపిలి: మండల పరిధిలోని డి. రంగాపురం గ్రామంలో తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. వారం రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ శివారు ప్రాంతంలోని వ్యవసాయ బోర్ల నుంచి ద్విచక్రవాహనాలపై నీళ్లు తెచ్చుకుంటున్నారు. మరి కొందరు ట్యాంకర్లు కొనాల్సిన పరిస్థితి నెలకొంది. నీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్‌ను వివరణ కోరగా రాచవాండ్లపల్లి సంపు వద్ద పైప్‌లైన్ లీకేజీ కావడంతో సమస్య తలెత్తిందన్నారు. సోమవారం నాటికి సమస్యను పరిష్కరించి నీటి సరఫరా చేస్తామన్నారు.

నేడు సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ట

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ట చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

ఫ్లెక్సీలు తొలగించాలి

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లను తొలగించాలని ఈఓ ప్రకాష్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా, డివైడర్ల మధ్యలో, ముదిగేడు, జమ్మలమడుగు, బనగానపల్లె, అంకాలమ్మ చౌరస్తా మలుపుల్లో వీటిని ఏర్పాటు చేశారన్నారు. వీటి వల్ల ప్రజలు, వాహన చోదకులు, విద్యార్థులకు అసౌకర్యంగా ఉండడమే కాకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. వాటిని తొలగించి గ్రామ పంచాయతీకి సహకరించాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ అనందరావు తెలిపారు. కోవెలకుంట్ల ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న రామమోహన్ రెండు రోజుల క్రితం నంద్యాలకు బదిలీ కాగా ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా కావలిలో పనిచేస్తున్న ఆనందరావును నియమించడడంతో ఆయన విధుల్లో చేశారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కోవెలకుంట్ల మండలంలోని గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లతో పాటు దొర్నిపాడు సెక్షన్ పరిధిలో ఏవైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.


తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న కమిషనర్

బేతంచెర్ల: వేసవి సమీపిస్తున్న తరుణంలో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా శనివారం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వస్తున్న నీటితో పాటు ప్రత్యామ్నాయంగా పట్టణం చుట్టూ ఉన్న బోరు బావులు, స్టోరేజ్ ట్యాంకులను వాటర్ వర్క్స్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. నగర పంచాయతీ పరిధిలో 5 లక్షల లీటర్ల నీటి నిలువ సామర్థ్యంతో భూగర్భ ట్యాంకర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించి వాటి ద్వారా పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా భూగర్భ ట్యాంకర్ల ఏర్పాటుకు పట్టణ శివారులో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించామన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి మార్చి నెల చివరిలోగా పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు



కమిషనర్, మెప్మా అధికారిణితో సమావేశమైన మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: స్వయం ఉపాధి పథకం కింద విద్యావంతులైన నిరుద్యోగులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో మెప్మా అధికారిని సుజాత, కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌తో సమావేశమైన అనంతరం ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. మున్సిపల్ పరిధిలో బీసీ, ఈబీసీలకు సంబంధించిన 75 మందికి రూ.1.50 కోట్లను 50 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తామన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గృహమే కదా.. స్వర్గ సీమ

- పల్లెల్లోనూ కొత్త డిజైన్లతో నిర్మాణాలు
- పట్టణాలకు దీటుగా ఇంటీరియల్

సాక్షి SUNDAY Special



రఘువరాజపల్లెలో అందంగా నిర్మించుకున్న ఇల్లు

కొలిమిగుండ్ల: ఇల్లు కట్టి చూడు..పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు.. అది ఒకప్పటి సామెత. ప్రస్తుతం ఈరెండింటికి ఎంత ఖర్చు అయినా వెచ్చిస్తున్నారు. గృహమే కదా స్వర్గసీమ..అందమైన ఇల్లు నిర్మించుకోవాలనేది సామాన్య, మధ్య తరగతి ప్రజల నుంచి అన్ని వర్గాల వారి కోరిక. గతంలో పల్లెల్లో ఎక్కడో ఒక చోట సంపన్నుల కుటుంబాల ఇల్లు విశాలంగా కనిపిస్తుండేవి. ఎక్కువ భాగం గుడిసెలు, మట్టి మిద్దెలే దర్శనమిస్తుండేవి. కాలం మారింది.. ప్రజల ఆర్థిక స్థితిగతులు క్రమేణా పెరిగాయి. పిల్లలను ఉన్నత విద్య చదివించడం ద్వారా వాళ్లు ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. పైగా ప్రజల మధ్య పోటీ తత్వం పెరిగిపోయింది. వాళ్ల కంటే మన ఇల్లే బాగా ఉండాలని పోటా పోటీగా పల్లెల్లో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. గ్రామాల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షల నుంచి మొదలు 60, 70 లక్షలపై ఖర్చు చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి వెచ్చించే ఖర్చు కంటే డిజైన్లకే ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. కొత్త డిజైన్లతో ఇంటీరియల్ డెకరేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. బయట ఎలివేషన్ మొదలు ఇంటీరియల్ ఎంపికలోనూ ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని ఎంచుకుంటున్నారు. పాల్ సీలింగ్, కప్ బోర్డులు, ఎలివేషన్, బాలకనీలు, స్టీల్ రెయిలింగ్ తదితర వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఇంటి లోపలి గోడలకు లప్పం వేయించడంతో పాటు డబ్ల్యూపీవీసీ డోర్లు, యూపీవీసీ కిటికీలు అమర్చుతున్నారు. వంట గదులను కప్‌బోర్డులతో చూడ ముచ్చటగా తీర్చిదిద్దుకుంటున్నారు. వంట గది, పూజ మందిరం డిజైన్‌లు అంతా మహిళలే ఎంపిక చేసుకుంటున్నారు.

ఫర్నీచర్ విషయంలోనూ తగ్గేదేలే

లక్షలు వెచ్చించి నిర్మించుకున్న ఇంటిలో ఫర్నీచర్ కొనుగోలులోనూ ఏమాత్రం తగ్గడం లేదు. ఇంటి గోడలకు వేసిన రంగుల ఆధారంగా సోఫా సెట్, డబుల్ కాట్ మంచం, కుర్చీలు, ఇతర ఫర్నీచర్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. వీటికి కూడా లక్షలు పోసి కొనుగోలు చేస్తున్నారు. టీవీ యూనిట్‌ను సైతం విభిన్నమైన డిజైన్‌లు, విద్యుద్దీపాలతో నిర్మించుకుంటున్నారు. అందులోనే అద్దాలతో షోకేజీలు ఏర్పాటు చేస్తున్నారు. 43 ఇంచులు మొదలుకొని 55 ఇంచుల వరకు ఎల్‌ఈడీ టీవీలు, సౌండ్ సిస్టమ్‌లు అమర్చుకుంటున్నారు. మొత్తంగా పట్టణాల కంటే మిన్నగా గ్రామాల్లో అందమైన కలల సౌరభాన్ని నిర్మించుకుంటున్నారు.

అందంగా ఉండేందుకు

ప్రతి ఒక్కరు తమకు ఇష్టమైన ఇల్లు ఉండాలని కలలు కంటుంటారు. అందులో కుటుంబం మొత్తం హాయిగా జీవించాలని కోరుకుంటారు. కాలం మారింది..అభిరుచులు మారాయి. అందుకే సకల సౌకర్యాలతో ఖర్చుకు వెనుకాడకుండా ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్నారు గ్రామీణులు. ఇల్లు అందంగా కనిపించేందుకు దగ్గరుండి పర్యవేక్షణ చేస్తూ ప్రతి పని విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇల్లు అందంగా కనిపించేందుకు చాలా కసరత్తులు చేస్తున్నారు. ఇంటి పైకప్పుకు ఇది వరకు పీఓపీ జిప్సం



నిర్మాణంలో ఉన్న ఇల్లు

పేట్లతో పాల్ సీలింగ్‌ను రకరకాల డిజైన్లతో ఏర్పాటు చేసుకుని రకరకాల విద్యుత్ బల్బులు అమర్చుకునే వారు. పాల్ సీలింగ్‌లో మరింత కొత్త ధనం చేరింది. యూపీవీసీ ప్లేట్లను సీలింగ్‌కు వాడుతున్నారు. గోడలకు వేసే రంగులు వేసేందుకు రక రకాల కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. ఇల్లు ఫొటోను డిజైనర్లకు పంపి ఐదారు రంగులతో డిజైన్ చేయించుకుని అందులో నచ్చిన దానిని ఎంపిక చేసుకుంటున్నారు. ఇంటి లోపల గ్రానైట్, మార్బుల్స్, టైల్స్ వేస్తున్నారు. మెట్లు, బాల్కనీలకు స్టీల్ రెయిలింగ్ ఉపయోగిస్తున్నారు. కప్ బోర్డుల విషయానికి వస్తే వారి వారి స్థాయిని బట్టి ధరలు ఉన్నాయి. వీటి విషయంలో సైతం ఎక్కువ మొత్తంలో ఖర్చు పెట్టేందుకు వెనుకాడటం లేదు. మళ్లీ ఇల్లు నిర్మించుకోలేం కదా అనే భావనలో ఆలోచన చేస్తున్నారు.

జనరిక్ మెడికల్ షాపులకు దరఖాస్తులు

బేతంచెర్ల: బీఫార్మసీ, డీఫార్మసీ చేసిన నిరుద్యోగ బీసీ, ఈబీసీ యువతీయువకులు స్వయం ఉపాధి పథకం కింద జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. ఈనెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను నగర పంచాయతీ కార్యాలయంలోని మెప్మా ఆఫీసులో అందజేయాలన్నారు.

చీటింగ్ కేసు నమోదు

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన రైతును మోసం చేసిన వ్యక్తులపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం పోలీసులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి అనే రైతు 2022లో 185 బస్తాల ఎండు మిరప కాయలను కోవెలకుంట్ల మండలం సొదరదిన్నె గ్రామ సమీపంలో ఉన్న శివారెడ్డి గోదాములో భద్ర పరిచాడు. కొన్ని రోజులకు కిలో రూ. 220 ప్రకారం 57 బస్తాలను విక్రయించి మిగిలిన దిగుబడులను గోదాములో నిల్వ ఉంచుకున్నాడు. డబ్బులు అవసరం కావడంతో 2024లో ఉయ్యాలవాడ మండలం మాయలూరు కరూర్ వైశ్యబ్యాంకులో దిగుబడుల బాండ్ల ఆధారంగా రూ. 5.50 లక్షల రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణం చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయడంతో అదే ఏడాది రూ. లక్ష వడ్డీ రూపంలో చెల్లించాడు. మొత్తం రుణం చెల్లించాలని గత ఏడాది సెప్టెంబర్ నెలలో మళ్లీ బ్యాంకు అధికారులు రైతుపై ఒత్తిడి చేశారు. దిగుబడులు విక్రయించి చెల్లిస్తానని చెప్పి గోదాము వద్దకు వెళ్లి దిగుబడుల వివరాలు అడగ్గా మిరపకాయలు విక్రయించామని చెప్పడంతో మోసపోయానని భావించి కోవెలకుంట్ల కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు గోదాము యజమాని హరినాథరెడ్డి, బ్యాంకు అధికారి శివభరత్‌రెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



కోట్లవారిపల్లెలో పింఛన్ కోసం గుమిగూడిన లబ్ధిదారులు

పింఛన్ కష్టాలు

డోన్ రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ లబ్ధిదారులకు కష్టాలు తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎక్కడ పడితే అక్కడ పింఛన్లు అందిస్తుండడంతో ఎక్కడికి పోవాలో అర్థం కాక అవ్వాతాతలు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు. కోట్లవారిపల్లెలో పింఛన్ల కోసం లబ్ధిదారులు గుంపులుగా పడిగాపులు కాశారు. ఎంతకూ పింఛన్లు అవ్వకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇచ్చేవారని.. ఇప్పుడు తమకేంటి ఈ కష్టాలు అంటూ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

పింఛన్ కోసం పడిగాపులు

ప్యాపిలి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సూర్యోదయానికి ముందే వలంటీర్లు పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు సర్కారు వలంటీర్లను పక్కకు పెట్టేసింది. వలంటీర్లు లేకపోయినా సచివాలయ సిబ్బందితో ఉదయాన్నే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. మండల కేంద్రం ప్యాపిలిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వరలక్ష్మి, రంగమ్మ, తిప్పమ్మ పింఛన్ కోసం పడిగాపులు కాస్తూ కనిపించారు. సచివాలయ సిబ్బంది పింఛన్ ఇచ్చిన తర్వాత వృద్ధులు మండుటెండలో ఇబ్బందులు పడుతూ ఇళ్లకు వెళ్లారు. వలంటీర్లు లేకపోవడంతో పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులు అడుగడుగునా దర్శనమిస్తున్నాయి.



ప్యాపిలి పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ఫీజు పోరును విజయవంతం చేద్దాం

డోన్: రాష్ట్ర ప్రజలను మరోసారి మోసగించి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారని మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్‌ఈ రాజవర్దన్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని చెప్పి విద్యార్థులను మభ్యపెట్టారని తెలిపారు. హామీత అములు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 5వ తేదీ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు రఫీ, రైల్వే నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, వెంగల్‌రెడ్డి, చంద్ర, పండు, మల్కాపురం మధు, పాతపేట రఫీ, మహేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ



కబడ్డీ ఆడుతున్న యువకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో హజరత్ సయ్యద్ షా అల్లాబకాష్ ఖాద్రిస్వామి ఉరుసును పురస్కరించుకుని శనివారం ఎడ్ల బండలాగుడు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరై ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు 17 జతల వృషభాలు, కబడ్డీ పోటీలకు 35 జట్లు హాజరయ్యాయి. యువకుల ఈలలు, కేరింతల మధ్య బండలాగుడు, కబడ్డీ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. కార్యక్రమంలో దర్గా ముజావర్లు సయ్యద్ గౌస్ పిరా, హిదాయత్ వలీ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పద్మావతి, గ్రామస్తులు ఇస్మాయిల్, రఫీ, ఇద్రూస్‌బాషా, సయ్యద్ బాషా పాల్గొన్నారు.


పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

బనగానపల్లె రూరల్: పట్టణంలో ఇళ్లులేని పేదలందరికీ రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఈద్గా నగర్ కాలనీలో సీపీఐ నాయకులతో కలిసి ఇళ్లులేని పేదల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఇళ్ల స్థలాలు లేని పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.



పేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నారులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ

బేతంచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ నీలావతి అన్నారు. మండల పరిధిలోని అంబాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కేంద్రంలోని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

ఆగిన నిర్మాణ పనులు



ఆగిపోయిన సచివాలయ నిర్మాణ పనులు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో సచివాలయ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గతంలో రెండు సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను మంజూరు చేశారు. అయితే పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పనులను సకాలంలో పూర్తి చేయించలేకపోయారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రస్తుతం రెండు సచివాలయాలను అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తులు

డోన్ టౌన్: కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కర్నూలు యూనిట్ పరిధిలో పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నివసిస్తూ చట్టాలపై అవగాహన, సామాజిక సేవా, ప్రజా సంక్షేమానికి అంకిత భావంతో ఉన్న వ్యక్తులు అర్హులన్నారు. కనీసం 10వ తరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా మండల లీగల్ సర్వీస్ అథారిటీ కార్యాలయాల నుంచి పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 5వ తేదీలోగా స్వయంగా లేదా పోస్టు ద్వారా పంపవచ్చని పేర్కొన్నారు.

ముమ్మరంగా కుష్టు వ్యాధి సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

డోన్ రూరల్: మండల పరిధిలో కుష్టు వ్యాధి సర్వే ముమ్మరంగా సాగుతోంది. శనివారం పలు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను హెల్త్ సూపర్‌వైజర్ కె.చంద్రశేఖర్ పరిశీలించారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 63 మంది అనుమానితులను గుర్తించినట్లు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రణీత్, ఆశావర్కర్ సువర్ణ ఉన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: కర్నూలు రహదారిలోని షిర్డీ సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే దత్తాత్రేయ, వినాయక, మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు నిజపాద దర్శనం కల్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బాబుల్ రెడ్డి, గుండా గోపాలు, వీరభద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెలవెల

- రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు ప్రభావం
- కోవెలకుంట్లలో మొదటి రోజు రిజిస్ట్రేషన్లు నిల్

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం భూ విలువ.. రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచి శనివారం నుంచి కొత్త చార్జీలను అమల్లోకి తెచ్చింది. చార్జీల పెంపు ప్రభావం తొలిరోజే స్పష్టంగా కనిపించింది. కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మొదటి రోజు శనివారం ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో వెలవెలబోయింది. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన ప్రజలు, రైతులు ఇళ్లస్థలాలు, ఇళ్లు, పొలాలు, తదితర ఆస్తులను కోవెలకుంట్లలో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. 25 నుంచి 60 శాతం వరకు చార్జీల పెంపు సామాన్య, మధ్యతరగతి వర్గాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఏడు నెలల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తి స్థాయిలో దెబ్బతినింది. రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచడంతో రియల్ వ్యాపారం మరింత పడిపోయింది. కోవెలకుంట్ల రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం రెండు చెల్లు రసీదులు మినహా ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో స్టాంప్ రైటర్లు మధ్యాహ్నానికే ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ ప్రభావం ఇలాగే కొనసాగితే ఆస్తుల క్రయ విక్రయాలు పూర్తిగా నిలిచిపోయినట్లే.



క్రయవిక్రయాలు లేక వెలవెలబోతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఎస్సీ వసతి గృహానికి ఫ్యాన్లు అందజేత

డోన్ టౌన్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని రిటైర్డు ఎంపీడీఓ ఉమామహేశ్వరరెడ్డి, వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌మోహన్ అన్నారు. శనివారం దాత ఉమామహేశ్వరరెడ్డి ఆర్థిక సహకారంతో ఎస్సీ బాలిక వసతి గృహానికి నాలుగు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు, మోటివేటర్ సర్వజ్ఞమూర్తితో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, కార్యదర్శి రంగయ్య, ఉపాధ్యక్షుడు కల్లాయప్ప, వార్డెన్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.



వసతి గృహానికి ఫ్యాన్లు అందజేస్తున్న దృశ్యం

డీఎస్పీకి సత్కారం

డోన్/డోన్ టౌన్: గణతంత్ర దినోత్సవం రోజున ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం శాలువా, పూలమాలలతో సత్కరించారు. క్రమశిక్షణతో విధి నిర్వహణతో పాటు డోన్‌లో క్రీడల అభివృద్ధికి చేస్తున్న సేవలను కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు సాధిక్, కోఆప్షన్ సభ్యుడు కుమ్మరి రాజు తదితరులు ఉన్నారు. అలాగే బీజేపీ డోన్ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ, ఆ పార్టీ నాయకులు నటరాజు, సుధాకర్, రవికుమార్, రాజశేఖర్ డీఎస్పీని సత్కరించారు.



డీఎస్పీని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

జీఓ 117 రద్దు చేయాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

బనగానపల్లె రూరల్: జీఓ నంబర్ 117ను పూర్తిగా రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షుడు మాదవస్వామి డిమాండ్ చేశారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వ పాఠశాలల విలీనం చేసే నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ నాయకులు లింగమయ్య, సుబ్బరాయుడు, వెంకటకృష్ణుడు, రామకృష్ణ, రమేష్, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.